



# కరపత్రం

SINCE 2014

బుధవారం జూలై 08, 2026 | సంపుటి : 2 | సంచిక : 266 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4


## ప్రజలకు మెరుగైన సేవలను
# అందించడమే లక్ష్యం

• ప్రజలకు మెరుగైన సేవలను అందించడమే లక్ష్యం



2 లో

- రాష్ట్రంలో డిజిటల్ గవర్నెన్స్ దిశగా అడుగులు
- పరిపాలన వ్యవస్థను పూర్తి స్థాయిలో డిజిటలైజేషన్
- సంక్షేమ పథకాలు నేరుగా లబ్దిదారులకు చేరేందుకు ఉపయుక్తం
- కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఆన్‌లైన్‌లోనే జీతాలు
- ఉన్నతస్థాయి సమీక్షలో సిఎం రేవంత్ ఆదేశాలు

**హైదరాబాద్,జూలై7 :**
పరిపాలనలో మరింత పారదర్శకతకు డిజిటల్ గవర్నెన్స్ దిశగా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. ఇందుకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేయడంతో పాటు అవసరమైన చట్టాలను రూపొందించాలని ఆదేశించారు. మంగళవారం ఎంసీఆర్ హెఆర్డీలోని బోధి పెవిలియన్ లో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ప్రజలకు మెరుగైన సేవలను అందించడంతో పాటు సంక్షేమ పథకాలు నేరుగా లబ్దిదారులకు చేర్చేందుకు డిజిటల్ గవర్నెన్స్ ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ ఉద్యోగులతో పాటు కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఒకటో తారీఖున జీతాలు అందించేందుకు వివరాలను పూర్తిగా డిజిటలైజ్ చేయాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో పరిపాలన వ్యవస్థను పూర్తి స్థాయిలో డిజిటలైజ్ చేస్తూ 'డిజిటల్ గవర్నెన్స్' దిశగా చట్టాలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు సంక్షేమ పథకాలను నేరుగా లబ్దిదారులకు చేర్చేందుకు ఈ విధానం ఎంతో దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. వివిధ విభాగాలలోని కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, జీతాలు, బ్యాంక్ అకౌంట్ వివరాలను పూర్తిగా డిజిటలైజ్ చేయాలన్నారు. రాష్ట్రంలో దాదాపు 4800 కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలు ఉండగా.. ఇందులో 4300 ఏజెన్సీలు ఉద్యోగులకు ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లించడం లేదని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఏజెన్సీలకు ప్రభుత్వం చెల్లింపులు చేసినా, ఉద్యోగులకు సమయానికి జీతాలు చెల్లించడం లేదని తెలిపారు. దీనిపై ప్రభుత్వం సీరియస్ గా ఉందని, అలాంటి ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. డిజిటల్ గవర్నెన్స్ తో సమస్యకు చెక్ పెట్టాలని సూచించారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఒకటి నుంచి 5వ తేదీలోగా పారదర్శకంగా జీతాలు చెల్లింపులు జరిపేందుకు డిజిటల్ గవర్నెన్స్ ఉపయోగపడుతుందన్నారు.



## మోదీ ఖాతాలో మరో పురస్కారం..
# "భారతీయులకు దక్కిన గౌరవం"

- ప్రధాని మోదీకి ఇండోనేషియా అత్యున్నత గౌరవం
- 'బింతాంగ్ ఆదిపూర్ణ' పురస్కారం ప్రదానం
- ప్రబోవో సుబియాంటో చేతుల మీదుగా అవార్డు
- భారత్--ఇండోనేషియా స్నేహానికి గుర్తింపు
- "భారతీయులందరికీ దక్కిన గౌరవం" -- మోదీ
- ద్వైపాక్షిక సంబంధాలకు అంతర్జాతీయ గుర్తింపు
- 1959 నుంచి ప్రతిష్ఠాత్మక పురస్కారఖ
- మోదీ ఖాతాలో మరో అంతర్జాతీయ అవార్డు
- భారత్ ప్రతిష్ఠను చాటిన గౌరవం
- ఆసియాన్ బంధాలకు మరింత బలం

**జకార్తా:**
భారత ప్రధాని నరేంద్ర మోదీకి అరుదైన గౌరవం దక్కింది. ఇండోనేషియా అత్యున్నత పురస్కారం 'బింతాంగ్ ఆదిపూర్ణ'ను ఆదేశ అధ్యక్షుడు ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో చేతుల మీదుగా (మంగళవారం) పీఎం మోదీ అందుకున్నారు. ఈ అవార్డు కోట్లాదిమంది భారతీయులకు దక్కిన గౌరవమని మోదీ పేర్కొన్నారు. భారత్-ఇండోనేషియా రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించినందుకు గాను ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఇండోనేషియా అత్యున్నత పురస్కారమైన 'బింతాంగ్ ఆదిపూర్ణ' ఇండోనేషియా ప్రభుత్వం ప్రకటించింది. ఈ సందర్భంగా ప్రధానమంత్రిఎక్స్ (ట్విట్టర్) వేదికగా స్పందిస్తూ..."ఈ ఉదయం నాకు ఇండోనేషియా అత్యున్నత పురస్కారాన్ని ఎంతో ఆప్యాయతతో అందించారు. ఈ గౌరవం కోట్లాది మంది భారతీయులకు దక్కినది... ఇది ఇండోనేషియా ప్రజల సెంటిమెంట్‌కు, భారత్-ఇండోనేషియాల మధ్య ఉన్న చారిత్రాత్మక, సన్నిహిత సంబంధాలకు ప్రతీక. ఈ సందర్భంగా అధ్యక్షుడు ప్రబోవో జీకి, ఇండోనేషియా ప్రభుత్వానికి ఇక్కడి ప్రజలకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నాను" అని పీఎం మోదీ పేర్కొన్నారు.

మిగతాద్ది 2 లో



# హిమాన్షు ముక్కుకు గాయం

– ఆస్పత్రికి వచ్చిన కెటిఆర్, కెసిఆర్

**హైదరాబాద్,జూలై7 :**
తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ మనవడు, కేటీఆర్ తనయుడు హిమాన్షుకు స్వల్ప గాయమైంది. నిన్న ఆటలాడుతుండగా అతడి ముక్కుకు గాయమైంది. ప్రస్తుతం హైదరాబాద్ ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు.

2 లో



# గుజరాత్ హైకోర్టు సంచలన తీర్పు

- 2008 వరుస బాంబు పేలుళ్ల కేసులో 38మందికి ఉరి
- మరో 11 మందికి యావజ్జీవ కారాగార శిక్ష విధింపు
- ప్రత్యేక కోర్టు తీర్పును సమర్థించిన హైకోర్టు

**అహ్మదాబాద్,జూలై7 :**
దేశాన్ని ఉలిక్కిపడేలా చేసిన 2008 అహ్మదాబాద్ వరుస బాంబు పేలుళ్ల కేసులో గుజరాత్ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది.

# బిఎల్‌వోలను బెదిరిస్తున్న ఎంఐఎం



2 లో

» సిఇవోకు ఫిర్యాదు చేసిన బిజెపి నేతలు

**హైదరాబాద్,జూలై7 :**
సర్ ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సీఈవోను బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు కోరారు. ఆయన ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిని ఆ పార్టీ బృందం కలిసింది. ఈ సందర్భంగా సర్ ఖీ విషయంలో ఎంఐఎం పార్టీ వ్యవహరిస్తున్న తీరు సరిగ్గా లేదని రాంచందర్ రావు ఫిర్యాదు చేశారు. అనంతరం బీజేపీ తెలంగాణ చీఫ్ మీడియాతో మాట్లాడుతూ.. పలు ప్రాంతాల్లో బీఎల్‌వోలను ఎంఐఎం, కాంగ్రెస్ నేతలు బెదిరిస్తున్నారని తెలిపారు.

# సింగరేణికి తాడిచర్ల-2 బొగ్గు గనులు

- 182 మి.టన్నుల బొగ్గు ఉత్పత్తికి అవకాశం
- సింగరేణికి రూ.75 వేల కోట్ల ఆదాయం
- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి



**న్యూఢిల్లీ,జూలై7 :**
తాడిచర్ల-2 బొగ్గు గనుల్ని సింగరేణికి ఇవ్వడానికి ప్రధాని మోదీ అంగీకరించినట్లు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వెల్లడించారు. ఆ బొగ్గు గనులకు సంబంధించి ఈ రోజే తాను సంతకం చేసినట్లు చెప్పారు. తాడిచర్ల-2లో 182 మి.టన్నుల బొగ్గు ఉత్పత్తికి అవకాశముందన్నారు. మరో 40-50 ఏళ్లపాటు బొగ్గు ఉత్పత్తి చేయొచ్చన్నారు. 'ఇతర రాష్ట్రాల్లో సింగరేణి సంస్థ బొగ్గు వేలంలో పాల్గొనేలా చేస్తున్నాం. నైని కోల్ బ్లాక్‌లో 340 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయి. ఇవి దాదాపు 30-35 ఏళ్లు సరిపోతాయి. నైని కోల్ బ్లాక్‌లో ఏటా 10 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి కోసం సింగరేణికి అవకాశం కల్పించాం. బొగ్గు ఉత్పత్తితో సింగరేణికి రూ.75 వేల కోట్ల రెవెన్యూ వచ్చే అవకాశం ఉంది.

మిగతాద్ది 2 లో



# ఇబ్రహీంపట్నం, మేడ్చల్, మహేశ్వరంలకు మహర్దశ

- రూ.338 కోట్లతో నాలుగు లేన్ల ఆధునిక రహదారులు
- నిర్మాణానికి శంకుస్థాపన చేసిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

**రంగారెడ్డి,జూలై7 :**
రూ.338 కోట్ల వ్యయంతో ఇబ్రహీంపట్నం, మేడ్చల్, మహేశ్వరం నియోజకవర్గాల్లో హైబ్రిడ్ అన్యుటీ మోడల్ విధానంలో చేపట్టనున్న ఆధునిక నాలుగు లేన్ల రహదారుల నిర్మాణ పనులకు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఈటల రాజేందర్, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన సభలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ, ఇబ్రహీంపట్నం ప్రజలు, కార్యకర్తలు, నాయకులు తనపై ఉంచిన విశ్వాసం వల్లే రాష్ట్రంలో కీలకమైన రోడ్లు, భవనాల శాఖ మంత్రిగా సేవ చేసే అవకాశం లభించిందన్నారు.

2లో..

# కడియంపై క్రమశిక్షణ చర్య తీసుకోవాల్సిందే

» నాకు తెలియకుండా ఎలా సమీక్షలు చేపడతారు
» మంత్రిగా తన శాఖలో జోక్యం చేసుకోవడం ఏమిటి
» సిఎం రేవంత్‌కు లేఖ రాసిన మంత్రి కొండా సురేఖ

**హైదరాబాద్,జూలై7 :**
స్టేషన్ ఘన్‌పూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తీరుపై దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు.



2లో..



మిగతాది 2లో

# పార్టీ పేరుమార్పుపై న్యాయ పోరాటం

## ఈసి నోటీసులపై ఢిల్లీ హైకోర్టులో కవిత పిటిషన్

**న్యూఢిల్లీ,జూలై7 :**
పార్టీ పేరు మార్చుకోవాలంటూ కేంద్ర ఎన్నికల సంఘం ఇచ్చిన నోటీసులపై కల్వకుంట్ల కవిత ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. పార్టీ ఖరారుపై కల్వకుంట్ల కవిత దిల్లీ హైకోర్టులో న్యాయ పోరాటానికి దిగారు.



# 10న రైతు ఆశీర్వాద సభ

- రద్దయిన చోటనే తిరిగి నిర్వహణ
- ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి తుమ్మల

**ఖమ్మం,జూలై7 :**
గత నెలలో రద్దయిన రైతు ఆశీర్వాద సభను తిరిగి ఈ నెల 10న నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. తెలంగాణలో రైతు సంక్షేమమే ధ్యేయంగా

# గురుకులాల్లో పరిశుభ్రతకు పెద్దపీట
## మెనూ ప్రకారం ఆహార సరఫరా

- అధికారులతో సమీక్షలో మంత్రి పొన్నం

గురుకులాలు, హాస్టళ్లలో క్లీన్ అండ్ గ్రీన్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని ఉన్నతాధికారులకు రోడ్డు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. మంగళవారం ఆయా శాఖల ఉన్నతాధికారులతో మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష నిర్వహించారు.



2లో..

## బిఎల్‌వోలను బెదిరిస్తున్న ఎంఐఎం

మొదటిపేజీ తరువాయి
ఇంటింటికీ వెళ్లకుండా బీఎల్‌ఓలను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. పలువురు ఓటర్లకు ఫారాలు అందడం లేదని రాంచందర్ రావు తెలిపారు. తెలుగు ఫారాలతో ఇతర రాష్ట్రాల ఓటర్లకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. హైదరాబాదే కాకుండా అవసరమైన అన్ని ప్రాంతాల్లో ఇంగ్లీషు ఫారాలు అందించాలని కోరినట్లు తెలిపారు. ఓటర్ల జాబితా లోపాలపై చర్యలు తీసుకోవాలని సీఈవోను కోరినట్లు రాంచందర్‌రావు పేర్కొన్నారు.

## ప్రజలకు మెరుగైన సేవలను అందించడమే లక్ష్యం

మొదటిపేజీ తరువాయి
అందుకే పూర్తి వివరాలను డిజిటలైజ్ చేయాలని తెలిపారు. ఇందుకు వివిధ విభాగాల అధికారులతో ఒక కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. కమిటీ 100 రోజుల్లో ఈ అంశాన్ని కొలిక్కి తీసుకు రావాలని ఆదేశించారు. హెల్త్ కార్డులు, ఇతర బెనిఫిట్స్ అమలు చేసేందుకు ప్రభుత్వ ఉద్యోగుల వివరాలను కూడా డిజిలైజ్ చేయాలన్నారు. నిరంతరం మానీటరింగ్ చేసేందుకు ఆర్థిక శాఖ విభాగం ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సలహాదారు రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సీఎం ప్రధాన కార్యదర్శి వి. శేషాద్రి, హెచ్‌ఆర్డీ వైస్ చైర్మన్ శాంతి కుమారి, వేతన సవరణ కమిషనర్ ఎన్. శివ శంకర్,ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ప్రణాళికా విభాగం కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

### మోదీ ఖాతాలో మరో పురస్కారం..

## "భారతీయులకు దక్కిన గౌరవం"

మొదటిపేజీ తరువాయి
**విదేశాంగ శాఖ స్పందన**
విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఈ అవార్డును "భారత్–ఇండోనేషియా స్నేహానికి దక్కిన నివాళి" గా అభివర్ణించారు. మన సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత లోతుగా చేయడంతో పాటు, భారత్ – ఆసియాన్ సంబంధాలను బలోపేతం చేయడానికి పీఎం మోదీ చేసిన నిరంతర కృషికి ఈ పురస్కారమే నిదర్శనమని విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ ఎక్స్‌లో రాసుకొచ్చారు.

**'బింతాంగ్ ఆదిపూర్ణ' పురస్కార చరిత్ర**
ఈ అవార్డును 1959 లో ఇండోనేషియా ప్రభుత్వం ప్రారంభించింది. ఇది రిపబ్లిక్ ఆఫ్ ఇండోనేషియాలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన, అత్యున్నతమైన పురస్కారం. ఇండోనేషియా రిపబ్లిక్ యొక్క ఐక్యత, నిరంతర వృద్ధి, శ్రేయస్సు కోసం అసాధారణమైన సేవలు అందించిన వ్యక్తులకు ఈ అత్యున్నత గౌరవాన్ని అందజేస్తారు.

## హిమాన్షు ముక్కుకు గాయం

మొదటిపేజీ తరువాయి
మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు వెంటనే ఆస్పత్రికి చేరుకోగా.. సిద్దిపేటలోని ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రం నుంచి బయల్దేరి కేసీఆర్ కూడా ఆస్పత్రికి వెళ్లారు. మనవడిని పరామర్శించి.. అతడి ఆరోగ్యం గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మరోవైపు తాను కోలుకుంటున్నట్లు హిమాన్షు ఎక్స్ వేదికగా వెల్లడించారు. చిన్నపాటి గాయమవ్వడంతో గత రాత్రి ఆస్పత్రిలో చేరానని తెలిపారు. పూర్తిగా కోలుకునేందుకు కొంత విశాంత్రి తీసుకోవాలని వైద్యులు సూచించినట్లు హిమాన్షు పేర్కొన్నారు. ఈ ఘటనపై కేటీఆర్ కూడా ఎక్స్ వేదిగా స్పందించారు. సోమవారం సాయంత్రం హిమాన్షుకు చిన్నపాటి గాయమైందని, ప్రస్తుతం చికిత్స కొనసాగుతున్నట్లు తెలిపారు. కొన్ని రోజుల్లోనే పూర్తిగా కోలుకుంటాడని అన్నారు. హిమాన్షు ఆరోగ్యంపై ఆరా తీసిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

## పార్టీ పేరుమార్పుపై న్యాయ పోరాటం

మొదటిపేజీ తరువాయి
తెలంగాణ రక్షణ సమితి పేరు తన పార్టీకి కేటాయించాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. తమ పార్టీ పేరును ఖరారు చేయడానికి ఎన్నికల సంఘం అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ జూన్ 23న లేఖ పంపిందని పిటిషన్‌లో పేర్కొన్నారు. తమకు ప్రత్యామ్నాయమైన పార్టీ పేర్లు చెప్పాలి తప్ప.. టీఆర్ఎస్ వచ్చే విధంగా ఎలాంటి పేరు ఉండొద్దని ఈసీ తెలిపిందని కోర్టు దృష్టికి తెచ్చారు. తెలంగాణ రక్షణ సేన పేరు టీఆర్ఎస్‌కు అర్థం వచ్చేలా ఉందని, ఈసీ నోటీసుకు సరైన రీతిలో సమాధానం చెప్పాలని ఢిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. అయితే ఈసీకి సమాధానాలు చెప్పాకే కోర్టుకు రావాలని కవితకు సూచించింది. పిటిషన్ విచారణకు చేపట్టడమంటే ఈసీ విధుల్లో జోక్యం చేసుకోవడమేనని న్యాయస్థానం అభిప్రాయపడింది.

## కడియంపై క్రమశిక్షణ చర్య తీసుకోవాల్సిందే

మొదటిపేజీ తరువాయి
దేవాదాయ శాఖ మంత్రిగా ఉన్న నన్ను , నా కార్యాలయాన్ని పూర్తిగా విస్మరించి, ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా కడియం శ్రీహరి కమిషనర్ ఆఫీస్‌లో అధికారిక సమీక్షా సమావేశం నిర్వహించారని ఆమె ఫిర్యాదు చేశారు. మాస్టర్ ప్లాన్లు, శాఖాపరమైన నివేదికలపై ఆదేశాలు జారీ చేయడం మంత్రి పరిధిలోని అంశమని, అలాంటప్పుడు ఒక ఎమ్మెల్యే దేవాదాయ శాఖ అధికారులను పిలిచి ఎలా ఆదేశిస్తారని సురేఖ ప్రశ్నించారు. కడియం శ్రీహరి చర్య ప్రభుత్వ పరిపాలనా వ్యవస్థలో అనుచిత సంప్రదాయానికి నాంది అని, ఇది కేవలం పరిపాలనా లోపం మాత్రమే కాదని, ఒక శాఖా మంత్రి అధికారాలను బహిరంగంగా ప్రశ్నించే కుట్ర అని ఆమె లేఖలో మండిపడ్డారు. గతంలోనూ ఉమ్మడి వరంగల్
జిల్లా నేతలను రెచ్చగొట్టి తనపై కడియం శ్రీహరి దుష్ప్రచారం చేశారని కొండా సురేఖ ఆరోపించారు. ఇప్పుడు కూడా ఉద్దేశపూర్వకంగానే తన్ను నిర్లక్ష్యం చేస్తూ ఆయన తీసుకుంటున్న ఇలాంటి చర్యల వల్ల దేవాదాయ శాఖ అధికార యంత్రాంగంలో తీవ్ర అయోమయం నెలకొందని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ప్రజాప్రతినిధిగా ఉంటూ ప్రభుత్వ నిబంధనలను, మంత్రి అధికారాలను అతిక్రమించిన కడియం శ్రీహరిపై పార్టీ క్రమశిక్షణా కమిటీ ద్వారా విచారణ జరిపించాలని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఆయనపై తగిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కొండా సురేఖ తన లేఖలో కోరారు. మంత్రిగా తనకు సమాచారం ఇవ్వకుండా కడియం దేవాదాయ శాఖపరమైన సమీక్ష నిర్వహించారని, ఆయన సమీక్షించడం పరిపాలనా వ్యవస్థకు విరుద్ధమని పేర్కొన్నారు. శాఖ మంత్రిగా అన్ని అధికారాలు తనకే ఉంటాయన్న సురేఖ.. కడియం వ్యవహారంపై పార్టీ, ప్రభుత్వ స్థాయిలో విచారణ చేపట్టాలని కోరారు. బొగ్గులకుంటలోని దేవాదాయశాఖ కమిషనర్ కార్యాలయంలో సోమవారం కడియం శ్రీహరి సమీక్ష నిర్వహించారు. దేవాలయాలకు సమస్య ఉంటే మంత్రి, అధికారులకు వినతిపత్రం ఇవ్వాలి కానీ, సమీక్ష నిర్వహించడం ఏంటని ప్రశ్నించారు. ఈ అంశంపై కడియం శ్రీహరి నుంచి వివరణ కోరాలని సీఎం రేవంత్‌రెడ్డికి సురేఖ విజ్ఞప్తి చేశారు.

# గుజరాత్ హైకోర్టు సంచలన తీర్పు

మొదటిపేజీ తరువాయి
ప్రత్యేక కోర్టు 2022లో విధించిన శిక్షలను సమర్థిస్తూ 38 మంది దోషులకు ఉరిశిక్షను, మరో 11 మందికి యావజ్జీవ కారాగార శిక్షను హైకోర్టు మంగళవారం ఖరారు చేసింది. ఈ కేసులో దాఖలైన అప్పీళ్లపై సుదీర్ఘ విచారణ అనంతరం న్యాయస్థానం ఈ తీర్పును వెలువరించింది 2008, జులై 26న అహ్మదాబాద్‌లో కేవలం 70 నిమిషాల వ్యవధిలో 21 చోట్ల బాంబు దాడులతో ఉగ్రవాదులు విరుచుకుపడ్డారు. ఈ దాడుల్లో 56 మంది మరణించగా, 246 మంది తీవ్ర గాయాలపాలయ్యారు. ఆ తర్వాత సూరత్‌లో పేలని బాంబులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మొత్తం 78 మందిపై విచారణ జరగగా, 2022లో ప్రత్యేక కోర్టు 49 మందిని దోషులుగా తేల్చి, 28 మందిని నిర్దోషులుగా విడుదల చేసింది. ఉరిశిక్ష అమలుకు హైకోర్టు ధ్రువీకరణ తప్పనిసరి కావడంతో రాష్ట్ర ప్రభుత్వం శిక్షల నిర్ధారణ కోసం హైకోర్టును ఆశ్రయించింది. జస్టిస్ అల్పేష్ కొగ్జే, జస్టిస్ సమీర్ దవేలతో కూడిన గుజరాత్ హైకోర్టు ధర్మాసనం గత రెండున్నరేళ్లుగా దాదాపు 248 సార్లు అప్పీళ్లపై విచారణ జరిపి మంగళవారం తుది తీర్పు వెల్లడించింది. . 38 మందికి మరణశిక్ష, 11 మందికి జీవితఖైదు విధిస్తూ 2022లో ప్రత్యేక న్యాయస్థానం ఇచ్చిన తీర్పును సమర్థించింది. కిందికోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను కొట్టివేసింది. ఈ పేలుళ్లలో మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు, గాయపడినవారికి రూ.5 లక్షల పరిహారం ఇవ్వాలని గుజరాత్ ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. మార్చి 31, 2027లోగా పరిహార చెల్లింపులు పూర్తి చేయాలని పేర్కొంది. నిషేధిత ఇండియన్ ముజాహిదీన్ , సిమి ఉగ్రవాద సంస్థల కుట్రను ప్రాసిక్యూషన్ నిరూపించగలిగింది. దేశద్రోహం, హత్య నేరాలతో పాటు కఠినమైన ఉగ్రవాద నిరోధక చట్టం 'ఉపా' కింద దోషులుగా న్యాయస్థానం తేల్చింది. కాగా, దేశ చరిత్రలోనే ఒకే కేసులో ఇంతపెద్ద సంఖ్యలో 38 మందికి ఉరిశిక్షలు ఖరారు కావడం ఇదే ప్రథమం.2008 జులై 26న అహ్మదాబాద్‌లో 21 చోట్ల జరిగిన వరుస పేలుళ్లలో 56 మంది ప్రాణాలు కోల్పోయారు. 246 మంది గాయపడ్డారు. నగరవ్యాప్తంగా ఆసుపత్రులు సహా పలుచోట్ల పేలుళ్లు జరగ్గా రెండ్రోజుల తర్వాత సూరత్ లోనూ బాంబులు గుర్తించారు. ఇక పేలుళ్ల శబ్దాలకు సమీపంలో ఉన్నవారు కొంతకాలం వినికిడి శక్తి కోల్పోయారు. దర్యాప్తులో భాగంగా అహ్మదాబాద్ నగర నేరవిభాగం 100 మందిని నిందితులుగా పేర్కొంది. 78 మందిపై విచారణ చేపట్టింది. 2022లో ప్రత్యేక న్యాయస్థానం ఇచ్చిన తీర్పులో 49 మందిని దోషులుగా నిర్ధరించింది. 28 మందిని నిర్దోషులుగా విడుదల చేసింది. అప్రూవర్‌గా మారిన ఒక నిందితుడికి క్షమాభిక్ష ప్రసాదించింది. తొలుత ఇచ్చిన వాంగ్మూలాలు ఉపసంహరించుకున్న మరో నలుగురు అప్రూవర్ల కు శిక్ష విధించింది. 2002లో జరిగిన గోద్రా అనంతర అల్లర్లకు ప్రతీకారంగానే ఈ దాడులు జరిపినట్లు నాడు వార్తలు వచ్చాయి. తర్వాత ఇండియన్ ముజాహిదీన్ బాధ్యత ప్రకటించుకుంది. ఈ కేసు విచారణ సమయంలో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. 24 మంది నిందితులు టన్నెల్ తవ్వి జైలు నుంచి తప్పించుకునేందుకు యత్నించారు. అయితే ఆ కుట్రను పోలీసులు భగ్నం చేశారు.

# సింగరేణికి తాడిచర్ల-2 బొగ్గు గనులు

మొదటిపేజీ తరువాయి
తాడిచర్ల -2 బొగ్గుగనులను సింగరేణికి ఇవ్వాలని గతంలో చాలా మంది సీఎంలు లేఖలు రాసినా ప్రయోజనం లేకపోయింది. తన వంతుగా సింగరేణికి అన్ని రకాలుగా అండగా ఉంటున్నా' అని కిషన్‌రెడ్డి తెలిపారు. దేశాభివృద్ధి విషయంలో సహకార సమాఖ్య విధానంతో అన్ని రాష్ట్రాలు కలిసి ముందుకెళ్లాల్సిన అవసరం ఉందని కిషన్ రెడ్డి అన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ సింగరేణి కోల్ కాలరీస్ లిమిటెడ్ అభివృద్ధి విషయంలో కేంద్ర ప్రభుత్వం గత 12 ఏళ్లుగా అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తోందని తెలిపారు. 39 వర్కింగ్ మైన్స్‌లో 21 అండర్ గ్రౌండ్ మైన్స్, 18 ఓపెన్ కాస్ట్ మైన్స్ ఉన్నాయని.. సుమారు 6 నుంచి 8 జిల్లాల్లో సింగరేణి బొగ్గు గనులు విస్తరించి ఉన్నాయని అన్నారు. లక్షలాది ప్రజల గుండెచప్పుడు సింగరేణి అని వెల్లడించారు. సింగరేణికి సంబంధించిన మేజర్ మైనింగ్ ప్రాజెక్టుల ఎన్విరాన్మెంటల్, ఫారెస్ట్ క్లియరెన్స్‌లను వేగవంతం చేయడంలో కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తోందని కిషన్ రెడ్డి తెలిపారు. తెలంగాణ ఉద్యమంలోనూ సింగరేణి కార్మికులు భాగస్వాములయ్యారని తెలిపారు. కార్మికుల ధైర్యాన్ని తెలంగాణ ప్రజలు ఎన్నటికీ మరిచిపోరన్నారు. ఒడిశాలో నైనీ
కోల్ బ్లాక్ సింగరేణికి వచ్చేలా కృషి చేసినట్లు తెలిపారు. సింగరేణి పురోగతికి తన వంతు సహకారం అందిస్తున్నట్లు చెప్పారు. తెలంగాణతో పాటుగా ఇతర రాష్ట్రాల్లో జరిగే బొగ్గు గనుల వేలంలో పాల్గొనేలా సింగరేణి ప్రయత్నాలు చేస్తోందని తెలిపారు. నైనీ కోల్ బ్లాక్‌లో సుమారు 340 మిలియన్ టన్నుల బొగ్గు రిజర్వ్ ఉన్నాయన్నారు. 30 నుంచి 35 సంవత్సరాలకు సరిపోయే బొగ్గు ఉందని తెలిపారు. ఏటా 10 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసే అవకాశం సింగరేణికి లభించిందని.. దీని వల్ల సింగరేణికి సుమారు రూ.75 వేల కోట్ల రెవెన్యూ వచ్చే అవకాశం ఉందన్నారు. సింగరేణికి తాడిచర్ల-2 బొగ్గు గనులు కేటాయించామని కిషన్ రెడ్డి తెలిపారు. తాడిచర్ల-2 బొగ్గు గనులపై తుది నిర్ణయం తీసుకున్నామన్నారు. దాదాపు 182 మిలియన్ టన్నుల బొగ్గు రిజర్వ్ ఉన్న ఈ బ్లాక్ ద్వారా.. ఏటా 6 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరుగుతుందన్నారు. దాదాపు 40 నుంచి 50 ఏళ్ల పాటు ఈ గని నుంచి బొగ్గు ఉత్పత్తి జరుగుతుందని చెప్పుకొచ్చారు. దీని ద్వారా మొత్తంగా రూ.64,000 కోట్లకు పైగా రెవెన్యూ వచ్చే అవకాశం ఉందని తెలిపారు. నేరుగా సింగరేణికి ఈ గని ఇవ్వడం ద్వారా ఆక్షన్ ప్రీమియం చెల్లింపు లేని కారణంగా ఆ సంస్థకు కనీసం రూ.2,550 కోట్లు మిగులుతుందన్నారు. తెలంగాణ ప్రభుత్వానికి రాయల్టీ సహా వివిధ మార్గాల్లో దాదాపు రూ.16 వేల కోట్ల వరకు ఆదాయం సమకూరుతుందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

## ఇబ్రహీంపట్నం, మేడ్చల్, మహేశ్వరంలకు మహర్దశ

మొదటిపేజీ తరువాయి
ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడం తన బాధ్యత అని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రహదారుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఇప్పటికే రూ.85 కోట్ల విలువైన రహదారి పనులు పూర్తి చేశామని, మరో రూ.275 కోట్లతో పలు రహదారి అభివృద్ధి పనులు చేపడుతు న్నామని తెలిపారు. అదనంగా రూ.100 కోట్ల విలువైన కొత్త రహదారి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. పార్టీలు వేర్వేరు అయినప్పటికీ అభివృద్ధి విషయంలో అందరూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, జాతీయ రహదారుల విస్తరణ, వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తూ తెలంగాణను మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామని మంత్రి స్పష్టం చేశారు. పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ, ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో రూ.338 కోట్లతో 140కు పైగా రహదారి పనులు చేపట్టినట్లు తెలిపారు. గ్రామాలు, బస్తీల్లో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. విద్య, వైద్యం, మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించిందని, ప్రభుత్వ పాఠశాలలను ఆధునిక తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌గా తీర్చిదిద్దుతున్నట్లు పేర్కొన్నారు. లక్ష్మీరెడ్డి పాలెం వద్ద ఫ్లైఓవర్, అండర్‌పాస్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ, ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి రూ.338 కోట్ల విలువైన రహదారి పనులు మంజూరు కావడం చారిత్రాత్మకమని పేర్కొన్నారు. ఇందులో సుమారు రూ.275 కోట్ల పనులు నేరుగా ఇబ్రహీంపట్నం పరిధిలో చేపడుతున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో నియోజకవర్గంలో 200 పడకల ఆసుపత్రి, ప్రభుత్వ పాఠశాలల ఆధునీకరణ, రహదారుల విస్తరణ వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. అలాగే రూ.2,300 కోట్లతో సమీకృత మార్కెట్ ఏర్పాటు ద్వారా వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర రోడ్డు అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధికి కూడా సమాన ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రోడ్లు, భవనాల శాఖ ద్వారా భారీ స్థాయిలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రధాన రహదారులను నాలుగు లేన్లుగా అభివృద్ధి చేయడం ద్వారా రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు ఉపాధి, పెట్టుబడులు, ప్రాంతీయ అభివృద్ధికి ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, రంగారెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్ చంద్రారెడ్డి, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ మధుసూదన్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## 10న రైతు ఆశీర్వాద సభ

మొదటిపేజీ తరువాయి
ప్రభుత్వం మరో భారీ బహిరంగ సభకు సిద్ధమైంది. 10వ తేదీన ఖమ్మం జిల్లా జగన్నాథపురంలో ప్రతిష్టాత్మక 'రైతు ఆశీర్వాద సభ' నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభం కానున్న ఈ భారీ సభలో సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సభాస్థలాన్ని స్వయంగా పరిశీలించారు.. సభకు సంబంధించిన ఏర్పాట్లను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా నిధులను రికార్డ్ స్థాయిలో అందజేసిందని కీలక వ్యాఖ్యలు చేశారు. కేవలం ఏడు రోజుల్లోనే ఏకంగా 7,491 కోట్ల రూపాయలను రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేశామని ఆయన స్పష్టం చేశారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందనడానికి ఇదే నిదర్శనమని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. ఎల్‌నినో పరిస్థితులు తీవ్రమవుతున్న నేపథ్యంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు వేగవంతం చేయాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. వర్షాభావ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు జిల్లాల వారీగా రూపొందించిన ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికలను పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు సిద్ధం కావాలన్నారు. ఎల్‌నినోపై అగ్రివర్సిటీ చేసిన సూచనలు రైతులకు సకాలంలో చేరేలా చర్యలు తీసుకోవాలి. ఇప్పటికే 'తెలంగాణ వాతావరణ సలహా కార్యక్రమం'తో రైతులకు వాట్సప్ ద్వారా కచ్చితమైన, సమయానుకూలమైన వాతావరణ సమాచారాన్ని అమలు చేస్తున్నాం. పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ ప్రణాళికలను వెంటనే అమలు చేయాలని తుమ్మల సూచించారు.

### ప్రజావాణి స్టేట్ నోడల్ అధికారిగా కే. విద్యాసాగర్

### – చార్జ్ అప్పగించిన దివ్య దేవరాజన్

సీఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి సమక్షంలో సీఎం ప్రజావాణి స్టేట్ నోడల్ అధికారిగా కే.విద్యాసాగర్ మంగళవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు సీఎం ప్రజావాణి స్టేట్ నోడల్ అధికారిగా బాధ్యతలు నిర్వహించిన దివ్య దేవరాజన్ పంచాయతీ రాజ్ శాఖ డైరెక్టర్ గా బదిలీ కావడంతో కొత్తగా పోస్టింగ్ అయిన విద్యాసాగర్ కు ఛార్జ్ అప్పగించారు. మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ జీ.చిన్నారెడ్డి వారిద్దరికీ శుభాకాంక్షలు తెలిపారు. దివ్య దేవరాజన్ అందించిన సేవలను చిన్నారెడ్డి కొనియాడారు. నూతన స్టేట్ నోడల్ అధికారి కే. విద్యాసాగర్ ఆధ్వర్యంలో సీఎం ప్రజావాణి కార్యక్రమం మరింత సజావుగా సాగుతుందని చిన్నారెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

## గురుకులాల్లో పరిశుభ్రతకు పెద్దపీట మెనూ ప్రకారం ఆహార సరఫరా

మొదటిపేజీ తరువాయి
ఈ సందర్భంగా ప్రభుత్వ మెనూ తప్పనిసరిగా అమలు చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. విద్యార్థుల సంక్షేమంపై డీబీసీవోలు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. బీసీ స్టడీ సర్కిల్స్ బలోపేతానికి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇతర రాష్ట్రాల స్టడీ సర్కిల్స్ విధానాలపై అధ్యయనం చేయాలని ఆదేశించారు. జూలై 16 నుంచి కులవృత్తుల మేళా.. అన్ని కులాలకు సమాన అవకాశం కల్పిస్తామని స్పష్టం చేశారు. స్కిల్ డెవలప్‌మెంట్‌తో బీసీలకు మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించాలని అన్నారు. ఎకనామిక్ సపోర్ట్ స్కీమ్స్‌పై సమగ్ర అధ్యయనం చేయాలని అధికారులను కోరారు. ఐటీ, ఐఐఎం విద్యార్థులకు ల్యాప్‌టాప్‌ల పంపిణీపై ఈ సందర్భంగా అధికారుల నుంచి మంత్రి నివేదిక కోరారు. గురుకులాలు, హాస్టళ్లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని అధికారులను మంత్రి పొన్నం ఆదేశించారు. కుట్టు మిషన్ పథకం అమలుకు సమగ్ర మార్గదర్శకాలు రూపొందించాలని సూచించారు. కాటమయ్య రక్షణ కవచాల కిట్ల పంపిణీ వెంటనే పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

### తాడిచర్లతో మరో 40 ఏళ్లపాటు ఢోకా లేదు

### కేంద్రానికి కృతజ్ఞతలు తెలిపిన డిప్యూటి సిఎం భట్టి

సింగరేణికి తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్‌ను కేంద్రం కేటాయించింది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ ప్రభుత్వం కృతజ్ఞతలు తెలిపింది. మంగళవారం హైదరాబాద్‌లో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం కృషి ఫలించిందని అన్నారు. మరో 40 ఏళ్ల పాటు మైనింగ్‌కు అవకాశం ఉందని పేర్కొన్నారు. 340 మిలియన్ టన్నుల బొగ్గు వెలికితీతకు అవకాశం కలిగిందని చెప్పారు. తాడిచర్ల-2లో 434.14 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయని వివరించారు. ఏడాదికి 10 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యంగా నిర్దేశిరచుకున్నామని డిప్యూటీ సీఎం తెలిపారు. బ్లాక్‌లో జీ-9 గ్రేడ్ నాణ్యమైన బొగ్గు లభ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ బొగ్గు బ్లాక్ ద్వారా 3 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగాలు వస్తాయని చెప్పారు. దీని ద్వారా భూపాలపల్లి ప్రాంత అభివృద్ధికి భారీ ఊతం లభించినట్లు అయిందని అన్నారు. దీంతో రైలు, రోడ్డు మౌలిక వసతుల అభివృద్ధికి దోహదం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. విద్యుత్, పారిశ్రామిక రంగాలకు దీర్ఘకాలిక బొగ్గు భద్రత ఉంటుందని చెప్పారు. సింగరేణి 100 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యానికి ఇది బలంగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇతర బొగ్గు బ్లాకులు కూడా సింగరేణికే ఇవ్వాలని ఈ సందర్భంగా కేంద్రానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరఫున డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క విజ్ఞప్తి చేశారు.

## బీఎల్ఓల పనితీరును పరిశీలించిన బీఆర్ఎస్ ఇన్‌చార్జి



**కరుణాకర్ మల్లి గారి, కరపత్రం ప్రతినిధి**
మేడ్చల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డి, ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) కార్యక్రమంలో భాగంగా మేడ్చల్ మున్సిపల్ పరిధిలో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న బూత్ లెవల్ అధికారుల (బీఎల్ఓ) పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పారదర్శకంగా, నిబంధనల ప్రకారం జరగాలని, ప్రతి అర్హుడైన ఓటరు పేరు జాబితాలో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. సర్వే నిర్వహిస్తున్న బీఎల్ఓలకు అవసరమైన సౌకర్యాలు అందిస్తామని భరోసా ఇచ్చారు.

## మేడ్చల్‌లో కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుల నియామక పత్రాలు అందజేత



**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
మేడ్చల్ నియోజకవర్గంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన మేడ్చల్, కిష్టాపూర్--పూడూర్, గుండ్ల పోచంపల్లి డివిజన్ అధ్యక్షులకు నియామక పత్రాలను అందజేశారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అన్ని వర్గాల ప్రజలకు చేరుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమం హైదరాబాద్, మల్కాజ్‌గిరి, మేడ్చల్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో బొడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ కుమార్ యాదవ్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు వేముల మహేష్ కుమార్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## మెడిసిటీకి NABH గుర్తింపు దేశంలోనే నాణ్యమైన వైద్య సేవలు



**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
ఎల్లంపేట మున్సిపల్ పరిధిలోని ఘన్‌పూర్‌లోని మెడిసిటీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ దేశంలో నాణ్యమైన వైద్య సేవలకు ప్రతీకగా భావించే చీూదీ‌ం అక్రిడిటేషన్ సాధించింది. తెలంగాణలోని టీచింగ్ హాస్పిటళ్లలో ఈ గుర్తింపు పొందిన అరుదైన సంస్థల్లో మెడిసిటీ ఒకటిగా నిలిచింది. నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయడం వల్లే ఈ గుర్తింపు లభించిందని సంస్థ అధ్యక్షుడు ప్రొఫెసర్ కె. శివరామకృష్ణ, సీఈఓ ఐనిష్ మర్చంట్ తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ఆధునిక వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువస్తామని వెల్లడించారు.

## అంగన్వాడి విద్యార్థులకు యూనిఫాంల పంపిణీ

**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
ఎల్లంపేట మున్సిపల్ పరిధిలోని నూతన వార్డులో ఉన్న అంగన్వాడి కేంద్రంలో విద్యార్థులకు మున్సిపల్ కౌన్సిలర్లు మంగళవారం యూనిఫాంలను పంపిణీ చేశారు.



ఈ సందర్భంగా కౌన్సిలర్లు మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్వహిస్తున్న అంగన్వాడి కేంద్రాలను మరింత బలోపేతం చేయడానికి అన్ని విధాలుగా కృషి చేస్తున్నామని తెలిపారు.
చిన్నారులకు నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన సౌకర్యాలు అందేలా చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు సద్ది సురేష్ రెడ్డి, చిన్నోళ్ల భాస్కర్, వేణుగోపాల్ గౌడ్, అంగన్వాడి సిబ్బంది, విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.

# సేవలకు పదవీ విరమణ మాత్రమే వ్యక్తిత్వానికి కాదు.

**రాష్ట్ర ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్**

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్**
నీటి పారుదల శాఖ సూపరింటెండెంట్,ఇంజనీర్‌గా విశిష్ట సేవలందించి పదవీ విరమణ పొందిన చొల్లేటి బుచ్చిరెడ్డి సన్మాన సభ వీ కన్వెన్షన్ కళ్యాణ మండపంలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు, ఇరిగేషన్ శాఖ అధికారులు, ఉద్యోగుల సమక్షంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్ మాట్లాడుతూ, చొల్లేటి బుచ్చిరెడ్డి గారు ఉద్యోగానికి మాత్రమే పదవీ విరమణ పొందారని, వారి సేవా తపనకు, నిజాయితీకి, మానవీయ విలువలకు పదవీ విరమణ ఉండదన్నారు. పదవీ విరమణ వేడుకలో తల్లిదండ్రులు, బంధువులను సంప్రదాయబద్ధంగా సన్మానించడం ద్వారా కుటుంబ విలువలు, భారతీయ సంస్కృతిని చాటిచెప్పిన ఆదర్శ వ్యక్తిగా నిలిచారని కొనియాడారు. జిల్లా ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్, టి ఎన్‌జీవోల జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ఇరిగేషన్ ఇంజనీర్ కేవలం కాలువలు నిర్మించే అధికారి కాదని, రైతు ఆశలను సాకారం చేసి వేలాది కుటుంబాల జీవితాల్లో సంతోషాన్ని నింపే మహోన్నత శిల్పి అని అన్నారు. డాక్టర్ ఒక మనిషి ప్రాణాన్ని కాపాడితే, ఇరిగేషన్ ఇంజనీర్ వేలాది రైతు కుటుంబాల జీవనాధారాన్ని కాపాడుతాడని పేర్కొన్నారు. చొల్లేటి బుచ్చిరెడ్డి సౌమ్య స్వభావి, ఆ జాతశత్రువు, కల్మషం లేని వ్యక్తిగా ఉద్యోగుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని, పదవీ విరమణ ఉద్యోగానికే తప్ప వారి సేవలకు, వ్యక్తిత్వానికి కాదని, వారి జీవితం ప్రతి ఉద్యోగికి ఆదర్శమని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, జిల్లా ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్, టి ఎన్‌జీవోల జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కార్యదర్శి సంగం లక్ష్మణరావు, కన్వీనర్, టీజీవో జిల్లా అధ్యక్షుడు




మడిపెల్లి కాళీచరణ్ గౌడ్, ముప్పిడి కిరణ్ కుమార్ రెడ్డి, రాగి శ్రీనివాస్, గంగారపు రమేష్, సర్దార్ హరిమేందర్ సింగ్, గూడ ప్రభాకర్ రెడ్డి, మామిడి రమేష్, దేవానంద్, సమరసేన్, అభినవ్ రెడ్డి, ప్రసాద్ రెడ్డి, రవీందర్ రెడ్డి, పోలు కిషన్ నాగరాజ్ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కోట రామస్వామి, ఇరిగేషన్ శాఖ అధికారులు, ఉద్యోగులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## కొత్తపల్లి శ్రీ భక్తాంజనేయ స్వామి ఆలయంలో 34వ వార్షికోత్సవ వేడుకలు

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట, జులై 7**
కరీంనగర్ జిల్లా జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లి గ్రామంలోని శ్రీ భక్తాంజనేయ స్వామి ఆలయంలో 34వ వార్షికోత్సవ మహోత్సవాలు మంగళవారం భక్తిశ్రద్ధలతో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు, కొత్తపల్లి మాజీ సర్పంచ్ బొద్దుల రవీందర్--అరుణ దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉత్సవాల్లో గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీర్వాదాలు పొందారు. వేడుకల్లో భాగంగా ఉదయం వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ పుణ్యాహవాచనం, నవగ్రహ పూజ, నవగ్రహ హవనం, ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం శ్రీ భక్తాంజనేయ స్వామివారికి విశేష అలంకరణ చేసి మహామంగళహారతి సమర్పించారు. ఆలయ ప్రాంగణమంతా భక్తి పారవశ్యంతో నిండిపోయింది. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపక



అధ్యక్షులు, మాజీ సర్పంచ్ బొద్దుల రవీందర్ మాట్లాడుతూ, ఆలయ అభివృద్ధికి గ్రామ ప్రజలు, దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని తెలిపారు. ప్రతి సంవత్సరం నిర్వహించే వార్షికోత్సవాలను మరింత వైభవంగా నిర్వహించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొల్పడంలో ఆలయం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ



పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు, యువకులు, వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో, పూలతో సుందరంగా అలంకరించడం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. మొత్తంగా 34వ వార్షికోత్సవ వేడుకలు భక్తి, ఆధ్యాత్మికత, సంప్రదాయ వైభవానికి ప్రతీకగా ఘనంగా జరిగాయి.

## ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతి అర్హుడూ ఓటరుగా నమోదు కావాలి: బుడిగె శ్రీకాంత్

**జమ్మికుంట, జూలై 7 కరపత్రం ప్రతినిధి**
ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ఓటు హక్కు అత్యంత కీలకమని, భారత ఎన్నికల సంఘం చేపట్టిన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో ప్రతి అర్హుడూ భాగస్వామి కావాలని యూత్ కాంగ్రెస్ జమ్మికుంట మండల అధ్యక్షుడు బుడిగె శ్రీకాంత్ పిలుపునిచ్చారు. హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వొడితల ప్రణవ్ బాబు ఆదేశాల మేరకు మంగళవారం జమ్మికుంట మున్సిపాలిటీ 9వ వార్డులో ఇంటింటికీ వెళ్లి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పారదర్శకమైన, నిష్పాక్షికమైన ఓటరు జాబితా రూపకల్పన ద్వారానే ప్రజాస్వామ్యానికి మరింత బలం చేకూరుతుందని పేర్కొన్నారు. 2026 అక్టోబర్ 1 నాటికి 18 సంవత్సరాలు పూర్తయ్యే ప్రతి యువతి, యువకుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. యువత చేతుల్లోనే దేశ భవిష్యత్తు ఉందని, ప్రతి ఓటు విలువైనదని ఆయన అన్నారు. చనిపోయిన వారి పేర్లను జాబితా నుంచి తొలగించడం, ఒకే వ్యక్తికి




వేర్వేరు ప్రాంతాల్లో ఉన్న నకిలీ ఓట్లను గుర్తించి తొలగించడం వంటి చర్యలతో ఎన్నికల ప్రక్రియ మరింత పారదర్శకంగా మారుతుందని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు) ఇంటింటికీ వచ్చినప్పుడు ప్రజలు అవసరమైన వివరాలు అందించి సహకరించాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించే బాధ్యతను అధికారులు సమర్థంగా నిర్వహించాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లోని నిరక్షరాస్యులు, వృద్ధులకు యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు తోడ్పాటునందించి ఓటరు నమోదు ప్రక్రియలో



సహకరించాలని సూచించారు. అలాగే, ప్రజలు తమ స్మార్ట్‌ఫోన్ ద్వారా ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ లేదా భారత ఎన్నికల సంఘం అధికారిక వెబ్‌సైట్ ద్వారా కూడా స్వయంగా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పొనగంటి రవి, 9వ వార్డు బీఎల్ఏ పొనగంటి కుమార్, సీనియర్ నాయకులు కాంశెట్టి రమేష్, ఉడుగుల మల్లయ్య, యెబుషి ఓదెలు, నలగాష రాజకొమురయ్య, కోరే సదానందం తదితరులు పాల్గొన్నారు.

# నరసరావుపేటలో వల్లపు చెరువు అభివృద్ధి పనులు

## పురోగతి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే అరవింద బాబు

**నరసరావుపేట, కరపత్రం ప్రతినిధి జూలై 07 :**
పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో సుమారు 200 సంవత్సరాల చరిత్ర కలిగిన వల్లపు చెరువు అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు అన్నారు. ప్రధానమంత్రి కృషి యోజన (గ్రావీఖా) 2.0 కింద రూ.1.30 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు మే 22న అధికారికంగా పనులు ప్రారంభించారు. తొలి విడతగా రూ.50 లక్షల నిధులు మంజూరై ప్రస్తుతం ప్రారంభ దశ పనులు కొనసాగుతున్నాయి. మంగళవారం చెరువు వద్దకు వెళ్లిన నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు జరుగుతున్న అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అధికారులను పనుల పురోగతి గురించి అడిగి తెలుసుకుని, నాణ్యతలో ఎలాంటి రాజీ పడకుండా పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నరసరావుపేట పట్టణంలోని చారిత్రక వల్లపు చెరువును మోడల్ ట్యాంక్‌గా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రధానమంత్రి కృషి యోజన 2.0 నిధులతో చేపట్టిన ఈ ప్రాజెక్టు ద్వారా తాగునీటి భద్రత, భూగర్భ జలాల పెరుగుదల, పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజలకు ఆహ్లాదకరమైన విహార



వాతావరణం కల్పించనున్నట్లు చెప్పారు. ప్రస్తుతం చెరువులో పూడికతీత, ట్యాంక్‌బండ్ బలోపేతం, రిటైనింగ్ వాల్ నిర్మాణం, పరిసర ప్రాంతాల శుభ్రత వంటి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. తదుపరి దశలో వాకింగ్ ట్రాక్, ఇరువైపులా మొక్కల పెంపకం, సోలార్ లైటింగ్, పెద్దల కోసం బెంచీలు, చిన్నారుల కోసం పార్క్, బోటింగ్ సౌకర్యం వంటి ఆధునిక వసతులను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. చెరువు మధ్యలో శివుడి విగ్రహాన్ని ఏర్పాటు చేసి మొత్తం ప్రాంతాన్ని ఆకర్షణీయమైన విహార కేంద్రంగా తీర్చిదిద్దేలా ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. అదనంగా ప్రభుత్వ నిధులతో పాటు ఎన్ఆర్ఐల స్వచ్ఛంద సహకారంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే



వెల్లడించారు. ప్రజల సహకారంతో పనులను వేగంగా పూర్తి చేసి, 2027లో వచ్చే గంగమ్మ తల్లి తిరునాళ్ల నాటికి వల్లపు చెరువుకు సరికొత్త రూపును తీసుకురావడమే లక్ష్యమని ఎమ్మెల్యే అరవింద బాబు పేర్కొన్నారు. ఈ పరిశీలన కార్యక్రమంలో గుడి కమిటీ చైర్మన్ పాండురంగారావు, అధికారులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, నరసరావుపేట మున్సిపాలిటీ మాజీ చైర్మన్ నాగసారపు సుబ్బరాయగుప్తా, టీడీపీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# చల్లూరులో మహిళపై దాడి.. బంగారు గొలుసు చోరీ యత్నం భగ్నం
## ప్రతిఘటించిన మహిళ ధైర్యం.. సెల్‌ఫోన్, సైకిల్ వదిలేసి పరారైన దుండగుడు

**కరపత్రం ప్రతినిధి వీణవంక జూలై 7**
చల్లూరు గ్రామంలో ఓ మహిళపై గుర్తుతెలియని వ్యక్తి దాడి చేసి, ఆమె మెడలోని బంగారు పుస్తెల తాడును లాక్కెళ్లేందుకు ప్రయత్నించిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. బాధితురాలు ధైర్యంగా ప్రతిఘటించి గట్టిగా కేకలు వేయడంతో నిందితుడు తన ప్రయత్నాన్ని విరమించుకుని, సెల్‌ఫోన్, సైకిల్‌ను సంఘటనా స్థలంలోనే వదిలేసి పరారయ్యాడు.గ్రామానికి చెందిన వేముల పద్మ (45), భర్త వైకుంఠం, సోమవారం (జూలై 6) సాయంత్రం సుమారు 4:30 గంటల సమయంలో వర్షం పడుతున్న వేళ ఇంట్లో ఒంటరిగా ఉన్నారు. ఆ సమయంలో ఓ గుర్తుతెలియని వ్యక్తి ఇంటి ముందున్న చెట్టు కిందకు వచ్చి నిలబడ్డాడు. మహిళ ఒంటరిగా ఉందని నిర్ధారించుకున్న అనంతరం, ఆమె ఎందుకు వచ్చావని ప్రశ్నించినా పట్టించుకోకుండా ఇంట్లోకి బలవంతంగా ప్రవేశించాడు.లోపలికి వెళ్లిన వెంటనే పద్మ మెడలో ఉన్న బంగారు పుస్తెల తాడును లాగేందుకు ప్రయత్నించాడు. అయితే ఆమె ధైర్యంగా ప్రతిఘటించి నిందితుడి చేతులను గట్టిగా పట్టుకుంది. దీంతో ఆగ్రహానికి గురైన దుండగుడు ఆమె ముఖం, కడుపుపై బలంగా గుద్దుతూ దాడి చేసి అరవకుండా అడ్డుకునే ప్రయత్నం చేశాడు. అయినప్పటికీ బాధితురాలు గట్టిగా కేకలు వేయడంతో సమీపంలో ఉన్న ఆమె చిన్నమ్మాయి నవ్యశ్రీ, మరిది సంపత్, భర్త వెంటనే అక్కడికి చేరుకున్నారు.వారు వస్తున్నారని గమనించిన నిందితుడు భయంతో తాను తీసుకొచ్చిన సెల్‌ఫోన్, సైకిల్‌ను అక్కడే వదిలేసి పరారయ్యాడు. ఈ దాడిలో పద్మకు స్వల్ప గాయాలైనట్లు సమాచారం.సమాచారం అందుకున్న ఎస్సై ఆవుల తిరుపతి రాత్రి బాధితురాలి ఇంటికి చేరుకుని



సంఘటనా స్థలంలోనే ఆన్‌సైట్ ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. నిందితుడు వదిలివెళ్లిన సెల్‌ఫోన్, సైకిల్ ఆధారంగా అతడిని గుర్తించే ప్రయత్నాలు ప్రారంభించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. గ్రామంలో ఈ ఘటనతో మహిళలు భయాందోళనకు గురవగా, నిందితుడిని త్వరగా అరెస్ట్ చేయాలని స్థానికులు పోలీసులను కోరుతున్నారు.

# అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట.. విధులకు ఆటంకం కల్పించి బైక్ దోచుకున్న ముగ్గురు అరెస్ట్

- జమ్మికుంట పోలీసుల చాకచక్యం..
- అపహరించిన బైక్‌తో పాటు నేరానికి ఉపయోగించిన రెండు వాహనాలు స్వాధీనం
- ఇసుక అక్రమ రవాణాతో యువత మత్తు పదార్థాలకు బానిసవుతోంది: హుజూరాబాద్ ఏసీపీ మాధవి

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట, జూలై 7:**
కరీంనగర్ జిల్లా జమ్మికుంట పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హుజూరాబాద్ ఏసీపీ మాధవి మాట్లాడుతూ, అక్రమ ఇసుక రవాణాను అరికట్టే క్రమంలో విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందికి ఆటంకం కల్పించి, ఓ వ్యక్తిపై దాడి చేసి అతని మోటార్ సైకిల్‌ను బలవంతంగా అపహరించిన ఘటనలో జమ్మికుంట పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. అపహరించబడిన మోటార్ సైకిల్‌తో పాటు నేరానికి ఉపయోగించిన రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.జిల్లా పోలీసు అధికారుల ఆదేశాల మేరకు జమ్మికుంట పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమ ఇసుక రవాణాను అరికట్టేందుకు కొరపల్లి గ్రామ సమీపంలో ప్రత్యేక చెక్‌పోస్ట్ ఏర్పాటు చేసి పోలీసులు విధులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో అక్రమ ఇసుక రవాణాకు పాల్పడుతున్న కొందరు వ్యక్తులు తమ కార్యకలాపాలకు ఆటంకం కలుగుతోందనే ఉద్దేశంతో జూలై 6 రాత్రి చెక్‌పోస్ట్ వద్దకు చేరుకుని విధుల్లో ఉన్న హోంగార్డు, ఏఆర్ కానిస్టేబుల్‌తో గొడవకు దిగినట్లు దర్యాప్తులో వెల్లడైంది.అదే సమయంలో అక్కడ జరుగుతున్న ఘటనను వీడియో తీస్తున్న దొగ్గల రాజు అనే వ్యక్తిని లక్ష్యంగా చేసుకున్న నిందితులు అతడిని వెంబడించి వెంకటేశ్వర్లపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం సమీపంలో అడ్డగించి దాడి చేశారు. అనంతరం అతని వద్ద ఉన్న మోటార్ సైకిల్‌ను బలవంతంగా లాక్కొని పరారయ్యారు. తర్వాత ఆ వాహనాన్ని విలాసాగర్ గ్రామ శివారులోని ఎస్టీ కాలనీ సమీపంలోని పొదల్లో వదిలివేసినట్లు విచారణలో తేలింది.ఈ ఘటనపై కేసు నమోదు చేసిన జమ్మికుంట పోలీసులు ప్రత్యేక దర్యాప్తు చేపట్టారు. జూలై 7 ఉదయం జమ్మికుంట--కొరపల్లి రోడ్డులోని సైదాబాద్ రోడ్డు వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో అనుమానాస్పదంగా పారిపోవడానికి ప్రయత్నించిన ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు.

**అరెస్టైన నిందితులు:**
రాచపల్లి ప్రశాంత్ (27), విలాసాగర్ గ్రామం
రాచపల్లి సమ్మయ్య (58), విలాసాగర్ గ్రామం
రాచపల్లి రాజు (41), విలాసాగర్ గ్రామం

నిందితుల సమాచారం మేరకు అపహరించబడిన



మోటార్ సైకిల్‌తో పాటు నేరానికి ఉపయోగించిన పల్సర్ 150 సీసీ మోటార్ సైకిల్ (టీజీ-02-ఏ-5079), హీరో స్ప్లెండర్ ప్లస్ మోటార్ సైకిళ్లను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.ఈ కేసులో పరారీలో ఉన్న ఇతర నిందితుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని, నేరాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే రౌడీ షీట్లు కూడా తెరుస్తామని పోలీసులు హెచ్చరించారు.ఈ సందర్భంగా ఏసీపీ మాధవి మాట్లాడుతూ, అక్రమ ఇసుక రవాణా వల్ల సులభంగా డబ్బు సంపాదించే ధోరణి పెరిగి, కొంతమంది యువత మద్యం, మత్తు పదార్థాలకు బానిసలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అక్రమ ఇసుక రవాణాపై పోలీసులు నిరంతరం ప్రత్యేక నిఘా కొనసాగిస్తారని, చట్టాన్ని అతిక్రమించే వారిపై ఎలాంటి ఉపేక్ష ఉండదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట పట్టణ సిఐ రామకృష్ణ గౌడ్ ఎస్ఐలు రమేష్ రవి జీవన్. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా శ్రీ పంచముఖ, శ్రీ రామ సాయి దేవాలయ వార్షికోత్సవ వేడుకలు

అశేష సంఖ్యలోతరలివచ్చిన భక్తులు.. కన్నుల పండుగగా పూజా, హోమ కార్యక్రమాలు.
వార్షికోత్సవ వేడుకలకు హాజరైన మేయర్ కోలగాని శ్రీనివాస్.

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్**
కరీంనగర్ నగరపాలక సంస్థ 8వ డివిజన్, అలుగునూర్ పరిధిలోని శ్రీ వెంకటేశ్వర కాలనీలో గల శ్రీ పంచముఖ, శ్రీ రామ సాయి దేవాలయ16వ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం రోజున అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో, శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి , శ్రీ రామ నామస్మరణతో మార్మోగింది. ఈ ఆధ్యాత్మిక వేడుకల్లో భాగంగా నిర్వహించిన ప్రత్యేక పూజలు, హోమ కార్యక్రమాల్లో భక్తులు అశేష సంఖ్యలో పాల్గొన్నారు.ఆలయ వార్షికోత్సవం సందర్భంగా వేద పండితులు తిరునగిరి వెంకటాద్రి స్వామి, తిరునగిరి హర్షవర్ధన్ ఆధ్వర్యంలో ఉదయం నుంచే విశేష పూజా కార్యక్రమాలు ప్రత్యేక హోమం, అభిషేకాలను. శాస్త్రోక్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ దేవాలయ వార్షికోత్సవ వేడుకలకు మేయర్ కోలగాని శ్రీనివాస్ హాజరై, . ఆలయంలోని దైవ సన్నిధిలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ బాధ్యులు మేయర్ కోలగాని శ్రీనివాస్ ను సత్కరించారు. వేద పండితులు మేయర్ శ్రీనివాస్ కు ఆశీర్వచనం అందించారు.



అలాగే వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎంపీపీ కుంట రాజేందర్, మహాత్మా నగర్ గ్రామ సర్పంచ్ పొన్నాల సంపత్ ను ఆలయ కమిటీ సన్మానించింది. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలిరావడంతో దేవాలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. భక్తులందరికీ ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వాహకులు తగు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమం అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని అత్యంత భక్తిపూర్వకంగా నిర్వహించారు.ఈ వార్షికోత్సవ



వేడుకలు ఆధ్యాత్మిక శోభతో విజయవంతంగా ముగిశాయి. ఈ కార్యక్రమంలో శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయ ధర్మకర్తల సేవా సమితి అధ్యక్షులు చిందం నరసయ్య, గడప శేఖర్, సిరిపురం శ్రీనివాస్, సల్ల రాజయ్య, సల్ల మల్లేశం , సుధాకర్ రెడ్డి, మృత్యుంజయం, బండి కుమార్ , బూట్ల కరుణాకర్ , కొట్టాల శ్రీనివాస్ , చిందం అంజి, చిందం మనోహర్ ,మధు, కొత్తూరీ శ్రీనివాస్ , సిద్దయ్య లతోపాటు మహిళలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# చల్లూరులో మహిళపై దాడి చేసి చైన్ స్నాచింగ్‌కు యత్నించిన నిందితుడి అరెస్ట్

వేగంగా దర్యాప్తు పూర్తి చేసిన వీణవంక పోలీసులు - కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలింపు

**కరపత్రం ప్రతినిధి వీణవంక, జూలై 7:**
చల్లూరు గ్రామంలో ఇంట్లో ఒంటరిగా ఉన్న మహిళపై దాడి చేసి ఆమె మెడలోని బంగారు పుస్తెల తాడును అపహరించేందుకు ప్రయత్నించిన కేసును వీణవంక పోలీసులు వేగంగా ఛేదించారు. ఘటన జరిగిన కొద్ది సమయంలోనే నిందితుడిని గుర్తించి అరెస్ట్ చేసిన పోలీసులు, మంగళవారం కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్లు వీణవంక ఎస్సై ఆవుల తిరుపతి తెలిపారు.పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం, చల్లూరు గ్రామానికి చెందిన వేముల పద్మ (45), భర్త వైకుంఠం, ఈ నెల 6వ తేదీ సాయంత్రం సుమారు 4.30 గంటల సమయంలో ఇంట్లో ఒంటరిగా ఉన్నారు. ఇదే సమయంలో ఆమె ఒంటరిగా ఉన్న విషయాన్ని గమనించిన ఓ వ్యక్తి దొంగతనం చేయాలనే ఉద్దేశంతో ఇంట్లోకి చొరబడ్డాడు. మహిళ మెడ పట్టుకుని బలవంతంగా ఆమె మెడలో ఉన్న బంగారు పుస్తెల తాడును లాక్కోవడానికి ప్రయత్నించాడు.అయితే బాధితురాలు ధైర్యంగా ప్రతిఘటించడంతో నిందితుడు ఆమెపై దాడికి దిగాడు. ముఖం, కడుపుపై దాడి చేసి గాయపరిచినట్లు పోలీసులు తెలిపారు. దీంతో బాధితురాలు పెద్దగా కేకలు వేయడంతో సమీపంలో ఉన్న ఆమె కుమార్తె శాముల నవ్యశ్రీ (24), మరిది శాముల సంపత్ (38) వెంటనే అక్కడికి పరుగెత్తుకుంటూ వచ్చారు.కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకోవడం గమనించిన నిందితుడు భయంతో పరారయ్యే క్రమంలో తాను వచ్చిన సైకిల్‌తో పాటు సెల్‌ఫోన్‌ను సంఘటనా స్థలంలోనే వదిలివేసి పారిపోయాడు. ఈ ఆధారాలే కేసు ఛేదనకు కీలకంగా మారాయి.బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన వీణవంక పోలీసులు వెంటనే దర్యాప్తు ప్రారంభించారు. సంఘటనా స్థలంలో లభించిన సెల్‌ఫోన్‌తో పాటు ఇతర ఆధారాలను పరిశీలించిన పోలీసులు నిందితుడిని పిల్లి సదయ్య (45), తండ్రి కొమురయ్య, ఎల్బాక (ఘనముక్ల) గ్రామం, వీణవంక మండలానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. పోలీసులు ప్రత్యేకంగా గాలింపు చర్యలు చేపట్టి నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించారు. అనంతరం అతడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చి న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.ఈ సందర్భంగా వీణవంక ఎస్సై ఆవుల తిరుపతి మాట్లాడుతూ,




మహిళలు ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా, ఎవరైనా ఇంట్లోకి ప్రవేశించేందుకు ప్రయత్నించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# ట్రైనింగ్ కలెక్టర్ పి. హరిప్రసాద్‌కు జమ్మికుంట మున్సిపల్ కార్యాలయంలో ఘన సన్మానం



వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు సందేశం

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట, జూలై 7:**
జమ్మికుంట మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించిన ట్రైనింగ్ కలెక్టర్ పి. హరిప్రసాద్‌ను మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ ఘనంగా సన్మానించారు. కార్యాలయానికి విచ్చేసిన కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించి



మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు.ఈ సందర్భంగా మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందిస్తున్న పౌర సేవలు, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, పట్టణ అభివృద్ధి చర్యలపై అధికారులు ట్రైనింగ్ కలెక్టర్‌కు వివరించారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు.అనంతరం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా ట్రైనింగ్ కలెక్టర్ పి. హరిప్రసాద్, మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్, అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలంటే విస్తృతంగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఈ సందర్భంగా సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి, మేనేజర్ జి. రాజిరెడ్డి, వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్, మున్సిపల్ కౌన్సిలర్లు చందరాజు, పొనగంటి విష్ణువర్ధన్, చింతల శ్రీనివాస్, ఎగిత అశోక్, కోలుగురి సురేష్, యట్ల అశోక్, పాతకాల అనిల్, లక్ష్మణ్, మంద రాధా రాజేష్, శ్రీపతి నరేష్, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 49వ డివిజన్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ( ఎస్ ఐ ఆర్ )ఫారమ్‌లను అందజేయాలి



కార్పొరేటర్ ఏన్నంలక్ష్మీ ప్రకాష్

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్**
కేంద్ర ఎన్నికల కమిషన్ చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ. (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ .. ఎస్ ఐ ఆర్) కార్యక్రమంలో భాగంగా, ఓటర్లు తమ వివరాలను నమోదు చేసుకోవాలని 49వ డివిజన్ కార్పొరేటర్ ఎన్నం లక్ష్మి ప్రకాష్ ప్రజలను కోరారు. బి ఎల్ ఓ ల ద్వారా అందిన ఎన్యూమరేషన్ ఫారమ్‌ను ఓటర్లు ఈ క్రింది విధంగా పూర్తి చేయాలని వివరాలు తెలియజేస్తూ సూచించారు.పార్ట్ 1: 2002లో ఓటు హక్కు కలిగి ఉన్న వారి వివరాలు,పార్ట్ 2: తల్లి లేదా తండ్రి వివరాలు,పార్ట్ 3: ప్రస్తుత నివాస వివరాలు ఫారమ్‌పై ఫోటోను అంటించాలని తెలిపారు.పూర్తి చేసిన ఫారమ్‌లను స్వయంగా అందజేయడానికి జూలై 7, 8. ఉదయం 9:00 గంటల నుండి మధ్యాహ్నం 2:00 గంటల వరకు. సనాతన ధర్మం ఆఫీస్, భాగ్యనగర్ రోడ్ నెం. 6 లో సంప్రదించాలని సూచించారు.ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, తమ ఓటు హక్కు వివరాలను సరిచూసుకోవాలని కార్పొరేటర్ ఎన్నం లక్ష్మి ప్రకాష్ డివిజన్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# వ్యవసాయ సాగు సీజన్‌లో రైతులు అప్రమత్తంగా ఉండాలి:

నాణ్యమైన విత్తనాలు, ఎరువులనే కొనుగోలు చేయండి జమ్మికుంట మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట, జూలై 7:**
ఇటీవల కురిసిన వర్షాలతో వ్యవసాయ సాగు సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని జమ్మికుంట వ్యవసాయ మార్కెట్



కమిటీ చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం సూచించారు. నాణ్యమైన విత్తనాలు, ఎరువులను మాత్రమే కొనుగోలు చేసి, శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపడితేనే ఆశించిన దిగుబడులు సాధించవచ్చని ఆమె పేర్కొన్నారు.ప్రభుత్వం అనుమతి పొందిన లైసెన్స్ కలిగిన ఎరువుల దుకాణాల్లోనే విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాలని, ప్రతి కొనుగోలుకు సంబంధించిన రసీదు లేదా బిల్లును తప్పనిసరిగా భద్రపరచుకోవాలని రైతులకు సూచించారు. నకిలీ విత్తనాలు, నాసిరకం ఎరువుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అనుమానం వచ్చినా వెంటనే వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు.ఎరువుల దుకాణాల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా పాటించాలని, నిర్ణీత ధరలకే ఎరువులు విక్రయించాలని ఆమె స్పష్టం చేశారు. కృత్రిమ కొరత సృష్టించడం, అధిక ధరలకు విక్రయించడం, బిల్లులు ఇవ్వకుండా అమ్మకాలు నిర్వహించడం వంటి అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.అలాగే ప్రతి ఎరువుల దుకాణంలో ధరల జాబితాను స్పష్టంగా ప్రదర్శించాలని, అవసరమైన మేర నిల్వలను అందుబాటులో ఉంచి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, సాగు కాలంలో ఎలాంటి సమస్యలు తలెత్తినా సంబంధిత అధికారులను సంప్రదించాలని పుల్లూరి స్వప్న సదానందం రైతులకు విజ్ఞప్తి చేశారు.